# ఏదీ గీటురాయి



*భోజనం దేహి రాజేంద్ర*
*ఘృత సూప సమన్వితం*
*మాహిషంచ శరచ్చంద్ర*
*చంద్రికా ధవళందధి*

*భావం:* మహారాజా, నెయ్యితో, పప్పుతో, శరత్కాలంలో వెన్నెల వలె తెల్లనైన గేదె పెరుగుతో భోజనం పెట్టించండి.

"పల్నాటి యుద్ధం"లో శ్రీనాధుడు మాంచాలకు తల్లిచేత జన్మవృక్షానికి కీర్తీ, సుఖమూ అనే రెండు ఫలాలున్నాయనీ, కీర్తిని కోరే బాలచంద్రుణ్ణి సుఖాలకోసం ఆపవద్దనీ చెప్పిస్తాడు. సుఖమూ, కీర్తీ రెండూ దక్కితే ఇంకా బావుంటుంది కదా. సుఖపడ్డానికి డబ్బు కావాలి. ధనమూ,

కీర్తీ రెండూ వచ్చే మార్గం ప్రయత్నిస్తే దొరకవచ్చును. అలాంటి ప్రయత్నమే భోజరాజుగారి ధారానగరంలో ఇద్దరు యువ కవులు చేశారు.

రాజాస్థానంలో కవిత్వ పరీక్షలు నడుస్తున్నాయి. మంచి కవిత్వం చెప్పినవారికి మహారాజు సన్మానం చేసి, వెయ్యి వరహాల సంచీ బహూకరిస్తున్నారు. అది తెలిసిన ఇద్దరు యువ కవులు జంటగా శ్లోకం రాసి రాజుగారికి వినిపిద్దామనుకున్నారు. ఒక్క పద్యపాదం కూడా రాయలేకపోయారు. మధ్యాహ్నమైంది.

ఆకలి దంచెయ్యసాగింది. మనస్సు తిండి మీదకు పోయిందేమో యువకవుల్లో మొదటివాడు "భోజనం దేహి రాజేంద్ర" అని ఒక పాదం చెప్పాడు. భోజనం మీదకు పూర్తిగా మనస్సు పోయిన రెండవ వాడికి పప్పూ, నెయ్యీ మొదట తింటామని గుర్తువచ్చింది. వాడు "ఘృత సూపసమన్వితం" అన్నాడు. ఇద్దరికీ చాలా ఆనందం కలిగింది. కానీ ఇంకేం రాయాలో తెలియలేదు. ఇద్దరూ ఆ రెండు వాక్యాలూ వల్లెవేస్తూ కూచున్నారు. ఆ వాక్యాలలో అలంకారమూ, రసమూ ఏమీ లేవన్న ఊహ కూడా వాళ్ళకి రాలేదు.

ఆ దారిలో వెడుతున్న మహాకవి కాళిదాసుని చూసి ఇద్దరూ అరుగు దిగి అభివాదం చేశారు. వారి ముఖంలో ఆందోళన గమనించిన మహాకవి విషయమేమిటని అడిగాడు. వారు తమ సమస్య చెప్పుకున్నారు. కాళిదాసు "దానికేముంది? మీరు రెండు పాదాలు రాశారు కదా. మిగతావి నేను చెప్తాను రాసుకోండి" అని "మాహిషంచ శరచ్చంద్ర చంద్రికా ధవళం దధి" అన్నాడు. అన్ని ఋతువులలోనూ శరదృతువులోని వెన్నెల ఎక్కువ ఆహ్లాదకరం. ఆ కాలంలోని వెన్నెలంత తెల్లగా ఉన్న గేదె పెరుగు వెయ్యమని కాళిదాసు శ్లోకం పూరించాడు. యువకవులు ఉత్సాహంగా శ్లోకం పట్టుకుని వెళ్ళి కవిత్వ పరీక్షలలో చదివారు.

మహారాజు "మొదటి రెండు వాక్యాలు కేవలం ఛందస్సుకోసం రాసినట్లున్నాయి. మిగతా రెండు పాదాలకీ అక్షర లక్ష లివ్వవచ్చు" అని చెప్పి యువ కవులని సత్కరించాడు. కాళిదాసు కాలం విషయంలో, భోజరాజు ఆస్థానంలో ఉన్నది కాళిదాస మహాకవా లేక పరిమళ కాళిదాసా అన్న విషయంలో అనేక వాగ్వివాదాలున్నాయి.

కథలో సత్యాసత్యాలు పక్కనపెడితే పద్యంలో మొదటి రెండు పాదాలకీ, చివరి రెండు పాదాలకీ హస్తిమశకాంతరమున్నదన్న మాట వాస్తవం. కవిత్వం రాసిపేరూ, డబ్బూ సంపాదించాలన్న కోరిక చాలా సహజం. అందుకే కవుల సంఖ్య చాలా ఎక్కువ. రాశి ఎక్కువా, వాసి తక్కువా అయిన బాధ పడలేకనే కాబోలు కొండవీడులో విద్యాధికారిగా ఉన్న శ్రీనాథుడు "గాడిద నీవునుం కవివి కావు కదా అనుమానమయ్యెడిన్" అన్నాడు. వాసితో సంబంధం లేకుండా కవితలు రాసి, అచ్చువేసుకుని, అమ్ముడు పోకపోతే "చదివేవారి సంఖ్య తగ్గిపోయింది" అని వాపోయే వారు ఆనాడు కొండవీడులోనే కాదు నేడూ ఉన్నారు. భోజరాజులా గీటుపెట్టి నాణ్యత నిర్ణయించగల విమర్శకులున్నారా?

******